సాక్షి చిత్తూరు

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	17
తిరుపతి	33	17
తిరుమల	30	14
గూడూరు	33	19
నగరి	33	18



విశేష పూజలు

శ్రీకాళహస్తి: ఆలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకపూజ, కలశ పూజ, వైదిక కైంకర్యాలను వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఏడీవో పోస్టుల దరఖాస్తుకు నేడే ఆఖరు

పుత్తూరు రూరల్: జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ)లో అప్రెంటీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తుకు (ఫిబ్రవరి 10, 2023) శుక్రవారం ఆఖరని, చివరి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘ యూనియన్ కార్యదర్శి ఎల్.లక్ష్మణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా 9,394 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.750, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100 అని తెలిపారు. ఏదైనా డిగ్రీ ఉన్నవారు https://ibpsonline.ibps.in/licadojan23/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేపు జాతీయ లోక్‌అదాలత్



మీడియాతో మాట్లాడుతున్న కరుణకుమార్

చిత్తూరు అర్బన్: జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ కరుణ కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 11న జరిగే శనివారం జరిగే లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం అందించడానికి, కేసుల తాకిడిని తగ్గించడానికి అప్పీల్ లేని న్యాయాన్ని పొందేందుకు కచ్చితమైన పాత్రని పోషిస్తున్నామన్నారు. జిల్లా న్యాయ సేవాధికారితోపాటు అనుబంధంగా ఉన్న 13 మండల లీగల్ సర్వీస్ కమిటీలు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఉన్న ప్రాంతీయ కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా జడ్జి భీమారావు నాయకత్వంలో జరిగే ఈ జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

యువగళం గండాలు



హెడ్‌కానిస్టేబుల్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



త్రిశూలం గుచ్చుకుని గాయపడిన టీడీపీ కార్యకర్త

గండాలు.. కన్నీటి సుడిగుండాల మధ్య లోకేష్ పాదయాత్ర సాగుతోంది. నాయకులకే కాదు.. అటు కార్యకర్తలు, అధికారులకు సైతం ప్రాణసంకటంగా మారింది. తమపైనే ఆధారపడ్డ కుటుంబాలకు తీరని శోకం మిగులుతోంది. యువగళం పాదయాత్ర ప్రారంభమైన మొదటి రోజే తారకరత్న గుండె పోటుతో కుప్పకూలిపోగా.. 14వ రోజు మరో రూపంలో గండం ఎదురైంది. తోపులాటలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ గుండె ఆగిపోయింది. ఇక అరుపులు.. కేకలు, తోపులాటల మధ్య మరో కార్యకర్త త్రిశూలంపై పడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. మున్ముందు ఎన్ని అనర్థాలు ఎదురవుతాయో.. ఎంతమంది ప్రాణాలు పోతాయోనని నాయకులు, కార్యకర్తల గుండెల్లో గుబులు పట్టుకుంది.

- మొదటి రోజు తారకరత్నకు గుండెపోటు
- 14వ రోజు మరో అపశ్రుతి
- తోపులాటలో ఊపిరాడక హెడ్‌కానిస్టేబుల్ మృతి
- మరోఘటనలో త్రిశూలంపై పడి టీడీపీ కార్యకర్తకు గాయాలు
- ప్రాణ సంకటంగా మారిన లోకేష్ పాదయాత్ర
- ఫ్లాప్ టాక్ నుంచి బయటపడేందుకు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు

సాక్షి టాస్క్‌ఫోర్స్, తిరుపతి: మునిగిపోతున్న నావను తెడ్డేసి పైకిలేపాలని టీటీడీ అధిష్టానం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇందులో భాగంగానే యువగళం పేరుతో పార్టీ పేరునూ స్పష్టంగా పలకలేని నారా లోకేష్‌బాబును పాదయాత్రకు దింపింది. ఆయన పాదయాత్ర ప్రారంభించిన నాటి నుంచి తరచూ అపశ్రుతులు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. సినీ నటుడు నందమూరి తారకరత్న తీవ్ర గుండెపోటుతో కర్ణాటక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా గురువారం గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి పాదయాత్ర చేరుకోగా.. అక్కడ టీడీపీ కార్యకర్తలు, నాయకుల తోపులాటలో పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ రమేష్(56) ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. చికిత్స కోసం చిత్తూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు.



పాలసముద్రం: రంగాపురం బహిరంగ సభ వద్ద మద్యంతాగి పడిపోయిన టీడీపీ కార్యకర్త

రోడ్డుపై బైఠాయించి.. కార్యకర్తలను పురమాయించి

లోకేష్ యువగళం పాదయాత్ర గురువారం గంగాధరనెల్లూరు మండలం.. సమిసిరెడ్డిపల్లికి చేరుకుంది. అక్కడ రహదారిపై బహిరంగ సభకు పోలీసులు అనుమతించకపోవడంతో లోకేష్ రగిలిపోయారు. సమిసిరెడ్డిపల్లి రహదారిపైనే సభ పెట్టేందుకు కార్యకర్తలను పురమాయించారు. కార్యకర్త నుంచి మైక్ తీసుకునేందుకు ప్రయత్నం చేయగా.. లంచ్ బ్రేక్ ఏర్పాటు చేసిన ప్రాంతానికి వెళ్లి ప్రసంగించాలని డీఎస్పీ శ్రీనివామూర్తి సూచించారు. అయినా లోకేష్ వినకుండా రోడ్డుపై బైఠాయించారు. కార్యకర్తలందర్నీ రోడ్డుకు అడ్డుగా కూర్చోమని ఆదేశించారు. రాకపోకలకు ఇబ్బంది అవుతుందని పోలీసులు పలుమార్లు ప్రాధేయపడినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఒకానొక దశలో పోలీసులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు తిరగబడి దాడిచేసేందుకు యత్నించారు. తనకు చట్టం తెలుసంటూ పోలీసులపై లోకేష్ ఊగిపోయారు. మీ అంతుచూస్తానంటూ చిందులేశారు. ఈ పరిస్థితుల్లో అక్కడే విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

జనం లేరు..తరలించాలి సారూ!

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో లోకేష్ యాత్ర ప్రారంభం కాగా.. ఆ పార్టీ అగ్రనేతలకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం అటు ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. గతంలో పార్టీ లేదు.. బొక్కలేదు అన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఇప్పుడు 'చిత్తూరు జిల్లాలో యువగళం యాత్రకు జనం రాకపోవడంతో అధినేత, నేను చాలా బాధపడ్డాం'' అని చెప్పడం సంచలనంగా మారింది. జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చిట్టిబాబుకు ఫోన్‌చేసి యాత్రకు జనాన్ని తరలించాలని.. ఎంత డబ్బయినా పెట్టి 300 వాహనాల వరకు ఉండేలా జాగ్రత్తపడాలని సూచించారు. వీరి మధ్య సాగిన సంభాషణకు సంబంధించిన ఆడియో లీక్ అవ్వడంతో టీడీపీ శ్రేణులు షాక్‌కు గురయ్యారు. లోకేష్ పాదయాత్ర డొల్లతనం బయటపడిందని జనం చర్చించుకుంటున్నారు.



వెలవెలబోతున్న లోకేష్ సభ

టీడీపీ కార్యకర్తకు తీవ్ర గాయాలు

గంగాధరనెల్లూరు మండలం, పోటుకృష్ణమ్మపల్లికి చెందిన లోకనాథం (47) లోకేష్ పాదయాత్రలో పాల్గొని తీవ్రంగా గాయపడ్డాడు. ముత్యాలమ్మగుడి వద్ద పాదయాత్ర సాగుతుండగా కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పక్కనే ఉన్న త్రిశూలంపై లోకనాథం పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే టీడీపీ నేతలు గుట్టుచప్పుడు కాకుండా అతన్ని చిత్తూరుకు తీసుకెళ్లారు. లోకనాథం ఫొటోలు తీయడానికి, అతని గురించి తెలుసుకునేందుకు ప్రయత్నించిన మీడియాను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. లోకనాథం పరిస్థితి ఎలా ఉందనే విషయాన్ని గోప్యంగా ఉంచారు. రహస్య సమాచారం మేరకు లోకనాథం ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు సమాచారం.

వైభవంగా లక్ష కుంకుమార్చన



హోమ పూజల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన పూజలను రెండో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణ, ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి దంపతులకు పూజా సామగ్రిని అందజేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీహోమం, మహా మంగళహారతి చేశారు. రూ.1116 చెల్లించిన 128 జంటలు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ఈఓ, ఆలయ అధికారులు ఉభయదారులకు తీర్థప్రసాదాలను దంపతులకు అందజేశారు.

పూజల్లో పాల్గొన్న పెద్దిరెడ్డి

బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు. వీరిని ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ స్వాగతం పలికారు. అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట పెద్దిరెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం బోయకొండ గంగమ్మను దర్శించుకొన్నారు. అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, సోమల మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటితో ముగింపు

బోయకొండ గంగమ్మ ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారంతో ముగియనున్నట్లు ఈఓ చంద్రమౌళి పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాసనమండలి పోరు ఆరంభం

- షెడ్యూల్ జారీ చేసిన భారత ఎన్నికల సంఘం
- కసరత్తు ప్రారంభించిన జిల్లా యంత్రాంగం
- ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చిత్తూరు నుంచే
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్



కలెక్టర్ కార్యాలయం చిత్తూరు

ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు

జిల్లా	గ్రాడ్యుయేట్ ఓటర్లు	టీచర్ ఓటర్లు
అన్నమయ్య	23,704	1,723
బాపట్ల	26,372	1,728
చిత్తూరు	54,237	3,545
నెల్లూరు	1,09,015	7,993
ప్రకాశం	82,189	5,712
తిరుపతి	87,544	6,187
మొత్తం ఓటర్లు	3,83,061	26,888

సాక్షి, చిత్తూరు: శాసనమండలి (ఎమ్మెల్సీ) పోరుకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నగారా మోగించింది. ఆ షెడ్యూల్లో ఎన్నికల కసరత్తు వివరాలను క్షుణ్ణంగా పేర్కొంది. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు గ్రాడ్యుయేట్, టీచర్, లోకల్ అథారిటీ ఎమ్మెల్సీల పదవీ కాలం ముగియడంతో ఎన్నికకు ఈసీ షెడ్యూల్ జారీ చేసింది. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు (తూర్పురాయలసీమ), లోకల్ అథారిటీ స్థానాలకు ఎన్నికల కసరత్తు చిత్తూరు జిల్లా కేంద్రం నుంచి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలతో కథనం.

ఈనెల 23 లోపు నామినేషన్

ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా యండపల్లి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా విఠపు బాలసుబ్రహ్మణ్యం పదవీకాలం ఈ ఏడాది మార్చి 29వ తేదీతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీచేసింది. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి (ఆర్వో)గా కలెక్టర్ హరి నారాయణన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా డీఆర్వో రాజశేఖర్‌ను ఎన్నికల సంఘం నియమించింది. ఇదే విధంగా చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీగా బీ.ఎన్.రాజసింహులుకు ఈ ఏడాది మే 1వ తేదీతో పదవీకాలం ముగియనుంది. దీంతో ఆ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను నియమించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మండల ప్రజాపరిషత్ సభ్యులు (ఎంపీటీసీ), జిల్లా ప్రజాపరిషత్ సభ్యులు (జెడ్పీటీసీ), మునిసిపల్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటర్లుగా ఉంటారు. ఈ ఎన్నికలకు ప్రతి డివిజన్‌కు ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఈ నెల 16న నోటిఫికేషన్‌ను జారీచేయనున్నారు. నామినేషన్లను ఈ నెల 23వ తేదీలోపు దాఖలు చేయాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.10,000, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.

కసరత్తు ప్రారంభం

ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు (పాత జిల్లాల ప్రాతిపదికన) నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 320, టీచర్స్ ఎన్నికలకు 175 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం గ్రాడ్యుయేట్లు-3,83,061 మంది, టీచర్లు-26,888 మంది ఓటు హక్కును వినియోగించనున్నారు. నామినేషన్‌ల స్వీకరణ, పరిశీలన, పోలింగ్ ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియ చిత్తూరు జిల్లా ఆర్వో, కలెక్టర్ హరి నారాయణన్ పర్యవేక్షణలో జరగనున్నాయి. అన్నమయ్య, బాపట్ల, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల కలెక్టర్, జేసీ, డీఆర్వోల సమన్వయంతో ఎన్నికల కసరత్తు నిర్వహించనున్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రకాశం -నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల, స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ జారీ అయ్యింది. నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నాం. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుంది. ఎన్నికల కసరత్తులో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి. **– హరి నారాయణన్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి**

సర్టిఫికెట్లు స్వీకరించండి

చిత్తూరు కలెక్టరేట్ : గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన డ్రాయింగ్, ఎంబ్రాయిడింగ్ పరీక్షల సర్టిఫికెట్లను ఉత్తీర్ణత చెందిన అభ్యర్థులు స్వీకరించాలని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పరీక్షల విభాగం అధికారులు ఉత్తీర్ణత చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను డీఈవో కార్యాలయానికి పంపారని చెప్పారు. సంబంధిత అభ్యర్థులు కార్యాలయంలో పరీక్షల విభాగంలో సంప్రదించి సర్టిఫికెట్లు పొందవచ్చని డీఈవో తెలిపారు.

భూసేకరణ పనులు 98 శాతం పూర్తి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు-తచ్చూరు భూ సేకరణ పనులు 98 శాతం పూర్తయినట్లు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన గురువారం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారుల్లో రోడ్లు భవనాల శాఖ, రైల్వే శాఖ, విద్యుత్, మున్సిపల్, భూగర్భ గనుల శాఖ, అటవీ శాఖలకు చెందిన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. పెండింగ్ భూసేకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని 823 గ్రామాలకు గాను 766 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయినట్లు తెలిపారు. 253 గ్రామాలకు ఓఆర్ఐ షీట్లు వచ్చాయన్నారు. అందులో 53 ఓఆర్ఐ షీట్లు తప్పులు ఉండడంతో మిగిలిన 200 గ్రామాల్లో 141 గ్రామాలకు 13 నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. పకడ్బందీగా కసరత్తు చేపడుతున్నట్లు జేసీ వెల్లడించారు. ఈ సమావేశంలో తమిళనాడులోని కాంచీపురం పీడీ సావిత్రిదేవి, ఆర్డీవో రేణుక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై 555 కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జరిగిన ఆకస్మిక తనిఖీల్లో విద్యుత్ చౌర్యం, అదనపులోడ్ క్రమబద్ధీకరణ కేసులను తనిఖీ బృందం బుక్ చేసింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 555 కేసులు నమోదు చేసి రూ.13.60 లక్షల జరిమానా చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు పంపించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. తిరుపతి ఆపరేషన్ పరిధిలో 101 కేసులకు సంబంధించి, రూ.2.90 లక్షలు, తిరుపతి రూరల్‌లో 56 కేసులకు రూ.1.25 లక్షలు, పుత్తూరులో 85 కేసులకు రూ.2.91 లక్షలు, చిత్తూరు అర్బన్‌లో 54 కేసులు రూ.1.16 లక్షలు, చిత్తూరు రూరల్‌లో 56 కేసులు రూ.1.02 లక్షలు, మదనపల్లెలో 87 కేసులు రూ.2.03 లక్షలు, పీలేరులో 24 కేసులు రూ.72 వేలు, పుంగనూరులో 92 కేసులు రూ.1.61 లక్షల చొప్పున జరిమానా విధించామన్నారు.

ఆకలి మరణాలు నివారించడమే లక్ష్యం

- జగనన్న గోరుముద్ద అమలు సూపర్
- అక్రమాలపై సాక్ష్యాలతో 9490551117కి వాట్సాప్ చేయండి
- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి



పలమనేరులో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

పలమనేరు: ఆకలి మరణాలు లేని, ఆరోగ్య రాష్ట్రంగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆయన పలమనేరు నియోజకవర్గంలో గురువారం పర్యటించారు. పలమనేరు మున్సిపాలిటీలోని గంటావూరు రేషన్ దుకాణం, సంచార వాహనసేవలను అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గంగవరం మండలంలోని మారేడుపల్లి అంగన్‌వాడీ టీచర్ అటెండెన్స్ విషయంలో నిర్లక్ష్యం చేసినట్టు గుర్తించారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులు విచారణ చేపట్టాలని ఆదేశించారు. అమ్మరాజుపల్లి చౌకదుకాణంలో బియ్యం తక్కువగా ఉండడంతో షాపును సీజ్‌చేసి 6ఏ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి, పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిని చూసి చాలా బాగుందని కితాబిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకందించే నిత్యావసర వస్తువులు ప్రజలకు పటిష్టంగా చేరాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. రేషన్‌షాపుల్లో కొత్త బియ్యం వేస్తున్నారని దీని స్థానంలో పాత బియ్యం వేయాలనే విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏపీ ఫుడ్ కమిషన్ నాలుగు విభాగాల సేవలపై అజమాయిషీ ఉంటుందన్నారు. ఇందులో భాగంగా పీడీఎస్, ఐసీడీఎస్, వెల్ఫేర్, పీఎం మాతృవందన యోజన పథకాల అమలులో సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను జాయింట్ కలెక్టర్ల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వంద శాతం బడిలోనే తింటున్నారు

చిత్తూరు జిల్లాలో రెండోసారి పర్యటిస్తున్నట్లు ఇక్కడ జగనన్న గోరుముద్ద పటిష్టంగా సాగుతోందని విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. 26 జిల్లాల్లోని 578 పాఠశాలలను గమనించామని అయితే పలమనేరు నియోజకవర్గంలో మధ్యాహ్న భోజనాన్ని వందశాతం పిల్లలు తినడం చాలా ఆనందంగా ఉందన్నారు. గంగవరం హైస్కూల్లో తాను తిన్న టమాటాచట్నీ, లెమన్ రైస్ అద్భుతంగా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న పౌష్టికాహార వస్తువులు సక్రమంగా లబ్ధిదారులకు చేరడం లేదని గమనించామన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లలో వార్డెన్ల నిర్లక్ష్యంతో కొన్ని పథకాలు పక్కదారి పడుతున్నాయని వీటిపై చర్యలు తీసుకుంటామన్నారు. తమ శాఖ పరిధిలోని నాలుగు విభాగాల్లో ఏదైనా సమస్యలుంటే, అక్రమాలుంటే 9490551117కి వాట్సాప్ చేయాలని సూచించారు. ఆకలి చావులు లేని రాష్ట్రంగా మారడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం బాలికోన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాల్లో సాంఘిక సంక్షేమ జిల్లా అధికారిణి రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి రబ్బాని, ఎస్టీ సంక్షేమ అధికారి మూర్తి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ నిర్మల, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, తూనికలు, కొలతల శాఖ సీఐ దివ్య, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సీఎస్ డీటీలు, ఎంఈవోలు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం



కాణిపాకం ఆలయంలో వ్రతానికి హాజరైన భక్తులు



విరాళం ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం ఆలయంలో వెలసిన స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు దంపతులతో సహ భక్తులు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఆలయంలోని నిత్య అన్నదానానికి తిరుపతికి చెందిన హేమచంద్ర, కృష్ణ కుమారి రూ.లక్ష విరాళంగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి అందించారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

లోకేష్‌కు రాజకీయంలో ఓనమాలు నేర్పాను

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నారా లోకేష్‌కు 2011లో నారావారిపల్లెలో రాజకీయ ఓనమాలు నేర్పానని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గుర్తుచేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భూ బకాసురుడు, కబ్జాదారుడు అని మొత్తం 250 ఎకరాలు, రూ.500 కోట్లు కొల్లగొట్టేశాడన్న ఆరోపణలపై ఎమ్మెల్యే స్పందించారు. ఈ ఆరోపణలు నిజమని కాణిపాకంలో ప్రమాణం చేయగలవా అని సవాల్ విసిరారు. 1975 నుంచి జేఎంసీ సంస్థ ద్వారా రోడ్డు కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాను. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఇలా అంచెలంచెలుగా ఎదిగానని చెప్పారు. టీడీపీ, పీఆర్‌పీ, వైఎస్సార్‌సీపీలో జిల్లా అధ్యక్షునిగా పనిచేశానన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో రోడ్డు పనులు చేసినట్లు పేర్కొన్నారు. కుప్పంలో వేసిన రోడ్లు బాగున్నాయని, లోకేష్ తండ్రి చంద్రబాబు మెచ్చుకున్నారని గుర్తుచేశారు. 2014లో టీడీపీ తరుపున ఎమ్మెల్యే టికెటు ఇస్తానని చంద్రబాబు హామీనిచ్చారన్నారు. కానీ మాజీ ఎంపీ ఆదికేశవుల నాయుడి భార్య సత్యప్రభ వద్ద కోట్లు తీసుకొని ఇచ్చారని చెప్పారు. భయమంటే ఏంటో జగనన్నకు తెలియదని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆరణి శివకుమార్ తెలిపారు. విదేశాల్లో పీజీ పట్టా పొందిన ఆయనకు రెవెన్యూ యాక్ట్ గురించి తెలియకపోవడం బాధకమన్నారు. పిల్లబచ్చాగాడికి రాజకీయాలు తెలియవని చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ అన్నారు. టీడీపీ హయాంలో లిక్కర్ సంస్థలకు అనుమతులు ఇచ్చారని వాటిని వైఎస్సార్‌సీపీ వచ్చాక ఇచ్చారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న జనం కూడా యువగళంకు రావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు, చైర్మన్లు, డైరెక్టర్లు, రాహుల్‌రెడ్డి, రాంగణేష్, జ్ఞానజగదీష్, ధీరజ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమణ, పూర్ణ, నారాయణ, నవీన్, శ్రీకాంత్, సహదేవన్, సయ్యద్, హేమారెడ్డి, సంతోష్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఈసీ డైరెక్టర్



సంతోష్ అజామెరాకు చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కేంద్ర ఎన్నికల కమిషన్ డైరెక్టర్ సంతోష్ అజామెరా దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

చిత్తూరు అర్బన్: జీడీనెల్లూరు మండలంలో గురువారం జరిగిన నారా లోకేష్ పాదయాత్రలో గుండెపోటుతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబానికి శాఖ పరంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కుటుంబంలో చదువుకున్న వారికి ఉద్యోగం కల్పిస్తామని, అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన పేర్కొన్నార

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పులిచెర్ల(కల్లూరు): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు కల్లూరు ఎస్ఐ రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. కల్లూరు-పులిచెర్ల మార్గంలో కొక్కువారిపల్లెకు చెందిన వెంకట మునినాయుడు (54) అక్కడి రోడ్డు పక్కన బస్టాప్ వద్ద బుధవారం నిలుచుని ఉండగా కారు వేగంగా వచ్చి ఢీ కొనడంతో గాయపడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసికెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్ దగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పాతపేటకు చెందిన రెడ్డెమ్మ(75)స్వగ్రామం నుంచి కల్లూరుకు వస్తుండగా మార్గమధ్యంలో సదుం నుంచి కల్లూరు వైపు వస్తున్న క్రేన్ ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృత్యువాత

గూడూరు: రైలు ప్లాట్‌ఫాం వద్దకు వస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి దాని కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం తెల్లవారు జామున గూడూరు రైల్వే జంక్షన్‌లో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ కొండపనాయుడు వివరాల మేరకు.. గురువారం తెల్లవారు జామున తిరుపతి వెళ్తున తిరుమల ఎక్స్‌ప్రెస్ గూడూరు జంక్షన్ సమీపిస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తి పట్టాలపై పడిపోయాడు. దీంతో అతని కాలు, మెడ ప్రాంతాల్లో తీవ్ర గాయాలయ్యాయి. 108లో అతన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, మృతుడికి 45 ఏళ్ల వయసు ఉండవచ్చని, హిందీలో మాట్లాడుతున్నాడని తెలిపారు. బ్లూ గళ్ల లుంగీ, సిమెంట్ కలర్ రంగు చొక్కా ధరించి ఉన్నాడని ఎస్ఐ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

చిట్‌ఫండ్ కంపెనీకి వడ్డన

తిరుపతి లీగల్ : రెండు వేర్వేరు కేసుల్లో సేవాలోపానికి, అనైతిక వాణిజ్య పద్ధతులు పాటించినందుకు శ్రీరామ్ చిట్స్ ఫిర్యాదికి పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం రెండు కేసుల్లో తీర్పు చెప్పింది. వివరాలు.. ఉమ్మడి చిత్తూరు జిల్లా, కలకడ మండలం, తోటమాలపల్లెకు చెందిన జి.నాగరాజు కలకడకు చెందిన ఎం.వెంకటేశ్వర నాయుడు అనే ఏజెంట్ ద్వారా తిరుపతిలోని శ్రీరామ్‌చిట్స్‌లో నాలుగు చిట్స్ వేశాడు. 2014 అక్టోబర్ 13న శ్రీరామ్‌చిట్‌లో రూ.10 లక్షల చిట్‌ను పాడాడు. మధ్యలో అతను మృతి చెందాడు. చిట్ సంస్థ వివిధ రూపాల్లో సొమ్మును పట్టుకుని నాగరాజు కుమారుడు సునీల్‌కుమార్‌కు రూ.6.5 లక్షలు చెక్కును ఇచ్చారు. అయితే ఆ సొమ్మును ఏ బ్యాంకులో డ్రా చేసుకోవాలని కానీ, చెక్కు డేట్‌ను కానీ రాయకుండా అతని సంతకాలు తీసుకుని ఇచ్చారు. అదేవిధంగా మరో రూ.10లక్షల చిట్ 2015 జూన్ 12న పాడారు. ఆ చిట్‌లో వివిధ రూపాల్లో సొమ్మును చిట్ సంస్థ తీసుకుని రూ.6,69,750 విలువ చేసే చెక్కును సునీల్ కుమార్‌కు ఇచ్చారు. ఆ చెక్కులో కూడా అదేవిధంగా ఉంది. అయితే చిట్‌కు సంబంధించిన కొన్ని పత్రాలను ఏజెంట్ వెంకటేశ్వరనాయుడు వారికి ఇవ్వలేదు. దీనిపై వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. రెండు చెక్కులపై చిట్ సిబ్బంది సేవాలోపానికి పాల్పడ్డారని సునీల్‌కుమార్ తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో చిట్‌ఫండ్ సంస్థతో పాటు ఏజెంట్ వెంకటేశ్వరనాయుడుపై ఫిర్యాదు దాఖలు చేశాడు. ఆఫిర్యాదును పరిశీలించిన తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు పార్థసారథి, కమిషన్ సభ్యులు నాగశేఖర్‌రెడ్డి, స్నేహలత చిట్‌ఫండ్ సంస్థ రూ.14 లక్షల 22 వేలను 2019 అక్టోబర్ 13 నుంచి 9 శాతం వడ్డీలెక్కన ఫిర్యాదికి చెల్లించాలని తీర్పు చెప్పారు. అలాగే నష్ట పరిహారం కింద లక్ష, ఫిర్యాది ఖర్చుల కింద రూ.5 వేలను 45 రోజుల్లోపు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. మరో రెండు చిట్‌లకు సంబంధించి నాగరాజు భార్య జి. సరస్వతి వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేయగా శ్రీరామ్ చిట్‌ఫండ్ సంస్థ ఆమెకు రూ.13లక్షల 35 వేలను 9 శాతం వడ్డీలెక్కన 2019 అక్టోబర్ 13వ తేదీ నుంచి చెల్లించాలని తీర్పు చెప్పారు. అలాగే నష్ట పరిహారం కింద ఆమెకు రూ.50 వేలను, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.5 వేలను 45 రోజుల్లో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.


అనుమతి లేకుంటే క్రిమినల్ కేసులు



చిత్తూరు నగరంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: అనుమతి లేకుండా వివిధ పరీక్షల ల్యాబ్‌లు నిర్వహిస్తుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఐఓ రవిరాజు హెచ్చరించారు. చిత్తూరు నగరం పొన్నియమ్మగుడివీధిలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్‌లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా ల్యాబ్ నిర్వహిస్తున్నారని గుర్తించారు. వివిధ అనారోగ్య సమస్యలకు వాడే ఇంజక్షన్లను గుర్తించారు. ల్యాబ్ నిర్వాహకులకు విద్యార్హత లేదని తెలుసుకున్నారు. వెంటనే తాళం వేయాలని అధికారులు నిర్వాహకులకు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనల అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ తనిఖీలో అధికారులు రమేష్‌రెడ్డి, జయరాముడు పాల్గొన్నారు.

చలించిన హృదయాలు...!



చిన్నారి తండ్రికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పోలీసులంటే కఠినంగానూ ఉంటారు... ఆపద వస్తే ఆదుకుంటారు...కష్టమొస్తే చలించే హృదయం కలిగి ఉంటారని నిరుపించుకున్నారు. ప్రస్తుతం బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి రూ.6.48లక్షల నగదు సాయం అందించి శభాష్ అనిపించుకున్నారు. ఆ చెక్కును బాధిత కుటుంబానికి గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజు కుమార్తె బేబీ జేనిషాకు బ్లడ్ క్యాన్సర్ అని ఇటీవల వైద్యులు నిర్ధారించారు. చికిత్సకు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ, వెంటనే తోచినంత సాయం అందించి చిన్నారిని ఆదుకోవాలని పోలీసు శాఖకు పిలుపునిచ్చారు. పోలీసు శాఖ నుంచి వసూలైన మొత్తం రూ.6.48 లక్షలు చెక్కు రూపంలో ఎస్పీ చేతుల మీదుగా చిన్నారి తండ్రికి అందించారు.

'ఆపరేషన్ స్వేచ్ఛ'ను అమలు చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఆపరేషన్ స్వేచ్ఛను అమలు చేయాలని కార్మిక కమిషనర్‌కు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల రక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్మిక కమిషనర్ కృష్ణారెడ్డి, ఉప కార్మిక కమిషనర్ బాలు నాయక్, భవన నిర్మాణరంగ సహాయ కమిషనర్ చిన్న లాలాప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మేజిస్ట్రేట్‌కు అదనపు బాధ్యతలు



వీఎం శ్రీనివాసులు, ఇన్‌చార్జి మేజిస్ట్రేట్

తిరుపతి లీగల్ : తిరుపతి 2వ ప్రత్యేక మేజిస్ట్రేట్ కోర్టు మేజిస్ట్రేట్‌గా ఉన్న వీఎం శ్రీనివాసులను స్థానిక మొదటి ప్రత్యేక మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా అదనపు బాధ్యతలు ఇస్తూ జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఇన్ని రోజులు మొదటి ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్‌గా ఉన్న సుబ్బలక్ష్మి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆ కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా శ్రీనివాసులను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలువురికి జరిమానా

తిరుపతి, తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన పలువురికి రూ.67,160 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ వీఎం శ్రీనివాసులు గురువారం తీర్పు చెప్పారు.